సాక్షి
ఆదిలాబాద్
బుధవారం । 6 । మార్చి । 2024

50వ రోజుకు రిలే దీక్షలు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వే లైన్ ప్రకటించాలనే డిమాండ్‌తో రైల్వేలైన్ సాధన కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద చేపట్టిన రిలే దీక్షలు మంగళవారంతో 50వ రోజుకు చేరాయి. కేంద్రం స్పష్టమైన ప్రకటన చేసేంతవరకూ ఆందోళన కొనసాగిస్తామని కమిటీ చైర్మన్ దేవేందర్, ప్రధాన కార్యదర్శి నరేందర్ వెల్లడించారు.

ఇంటర్ పరీక్షలకు 493 మంది గైర్హాజరు

ఎదులాపురం: ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మంగళవారం మ్యాథ్స్, బోటనీ, పొలిటికల్ సైన్స్ పరీక్షలు నిర్వహించారు. జిల్లాలో మొత్తం 9,490 మంది విద్యార్థులకు గాను 8,997 మంది హాజరయ్యారు. 493 మంది గైర్హాజరైనట్లు డీఐఈవో రవీందర్‌కుమార్ తెలిపారు.

గరిష్టం/కనిష్టం
37.0/22.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండవేడిమి పెరగనుంది. ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

10న ప్రవేశ పరీక్ష

ఆదిలాబాద్‌రూరల్: ఎస్సీ స్టడీ సర్కిల్ సెంటర్ ఆధ్వర్యంలో అందించనున్న గ్రూప్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 10న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి సునీతకుమారి, స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ రమేశ్ ప్రకటనలో తెలిపారు. మావలలోని నలంద కళాశాలలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఎంపికైన వారికి ఐదు నెలల పాటు గ్రూప్ 1, 2, 3, 4 శిక్షణతో పాటు బ్యాంకింగ్, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు, స్టాఫ్ సెలెక్షన్ వంటి పోటీ పరీక్షలకు సంబంధించి శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. శిక్షణకాలంలో భోజనంతో పాటు రూ.2,500 విలువ చేసే స్టడీ మెటీరియల్ అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు బుధవారం సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పైపులైన్‌కు మరమ్మతు


పైపులైన్ మరమ్మతు చేయిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

సిరికొండ: 'గొంతు తడవాలంటే.. బండి కట్టాల్సిందే' శీర్షికన చిమ్మన్‌గూడ గ్రామ నీటి గోసపై 'సాక్షి'లో ఆదివారం ప్రచురితమైన కథనానికి మిషన్ భగీరథ అధికారులు స్పందించారు. ఎస్ఈ సురేశ్, డీఈ శ్రీనివాస్, ఏఈ జైపాల్ మంగళవారం గ్రామాన్ని సందర్శించారు. ట్యాంకు వద్ద ఉన్న పైపులైన్ మరమ్మతు పనులు పూర్తి చేశారు.

వేతనాలు చెల్లించకుంటే సమ్మెలోకి..

కైలాస్‌నగర్: అగ్రిమెంట్ ప్రకారం రిమ్స్‌లో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ బకాయిలను కాంట్రాక్టర్ మంగళవారంలోపు చెల్లించాలని, లేకుంటే ఈ నెల 7నుంచి కార్మికులు సమ్మెలోకి వెళ్లనున్నట్లు తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి దేవేందర్ తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో రిమ్స్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు చేపట్టిన ఆందోళన మంగళవారం 13వ రోజు కూడా కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిమ్స్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీగార్డు, పేషెంట్‌కేర్ కార్మికులకు జీవో 60 ప్రకారం వెంటనే వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ముజీబ్, ఖాసీం, సంగీత, ఇక్బాల్, సైఫ్‌ఖాన్, ప్రశాంత్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

అద్దె ఎగనామం..!



“ ఇవి ఆదిలాబాద్ పట్టణం ఓల్డ్ బస్టాండ్ ప్రాంతంలో మున్సిపాలిటీకి చెందిన దుకాణాలు. ఇక్కడ మొత్తం 24 షాపులున్నాయి. వీటిని అనేక ఏళ్ల క్రితం చికెన్, మటన్ విక్రయాల వ్యాపారులకు అద్దెకిచ్చారు. వీటికి సంబంధించి రూ.1కోటి 4లక్షల 80వేల 434 బకాయిలు రావాల్సి ఉంది. కానీ దుకాణాలు శిథిలావస్థకు చేరాయనే ఉద్దేశంతో షాపు యజమానుల నుంచి బల్దియా అధికారులు అద్దె వసూలు నిలిపివేశారు. వ్యాపారులు మాత్రం ఇక్కడే విక్రయాలు కొనసాగిస్తుండడం గమనార్హం.



ఇక్కడ కనిపిస్తున్న దుకాణాలు ఆదిలాబాద్ మున్సిపల్ పాత కార్యాలయం కిందివి. 38, 39 నంబర్ కలిగిన ఈ షాపులను ఎప్పుడో 15 ఏళ్ల క్రితం రూ.800 చొప్పున వ్యాపారులకు అద్దెకిచ్చారు. తక్కువ మొత్తం అద్దెను కూడా వారు చెల్లించకపోవడంతో బకాయిలు ప్రస్తుతం రూ.లక్షల్లో పేరుకుపోయాయి. 38వ షాపునకు రూ.5,05,425, 39వ షాపునకు రూ.5,57,309 బకాయిలు ఉన్నాయి. అద్దె చెల్లించకుంటే నోటీసులిచ్చి టెండర్ ద్వారా కొత్తవారికి కేటాయించాల్సిన బల్దియా అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

- రూ.కోట్లలో బకాయిలు
- బల్దియా ఖజానాపై ప్రభావం
- రాజకీయ జోక్యంతో దుకాణాల నిర్వహణ
- వసూలుపై దృష్టి సారించని అధికారులు
- మున్సిపల్ దుకాణ సముదాయాల మడిగెల పరిస్థితి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపాలిటీకి సంబంధించిన వ్యాపార సముదాయాలను తక్కువ ధరకు దక్కించుకున్న వ్యాపారులు వాటి అద్దెలు మాత్రం సక్రమంగా చెల్లించడంలేదు. ప్రతీనెల అద్దె వసూలు చేస్తూ చెల్లించని వారిపై కొరఢా ఝులిపించాల్సిన బల్దియా సిబ్బంది 'మామూలు'గా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇదే అదునుగా వ్యాపారులు ఏళ్లుగా అద్దె చెల్లించకపోవడంతో బకాయిలు కోట్లలో పేరుకుపోయి బల్దియా ఖజానాపై ప్రభావం చూపుతోంది. కార్మికులకు వేతనాలు ఇచ్చేందుకు నిధుల్లేవంటూ చెప్పే అధికారులు ఆదాయ రాబడిపై దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఇదీ పరిస్థితి..

గ్రేడ్–1 స్థాయి కలిగిన ఆదిలాబాద్ బల్దియాకు అదనపు ఆదాయం సమకూర్చుకోవాలనే ఉద్దేశంతో పట్టణంలోని శివాజీచౌక్‌లో 56, పాత బస్టాండ్ ప్రాంతంలో 24, మున్సిపల్ పాత కార్యాలయం కింద 40 చొప్పున మొత్తం 120 మడిగెలతో కూడిన వ్యాపార సముదాయాలను నిర్మించారు. వీటిలో కొన్నింటిని 15 ఏళ్ల క్రితం రూ.800, రూ.1000 చొప్పున అద్దెకిచ్చారు. ఓల్డ్ బస్టాండ్ ప్రాంతంలో చికెన్, మటన్ విక్రయ వ్యాపారులకు కేటాయించగా మిగతా రెండు చోట్ల అన్ని వర్గాల వారికి కేటాయించారు. వీటికి సంబంధించిన అద్దె ఎప్పటికప్పుడు వసూలు చేయాల్సి ఉంటుంది. అలాగే మార్కెట్ ధరలకనుగుణంగా అద్దె పెంచుతూ టెండర్లు నిర్వహించాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ ఇది అమలు కావడం లేదు. ఏళ్ల క్రితం షాపులను దక్కించుకున్న వారే పాతుకుపోయారు. వ్యాపారాలు నిర్వహిస్తూ ఆర్థికంగా ముందుకు సాగుతున్నారు. కానీ బల్దియాకు చెల్లించాల్సిన అద్దెలను మాత్రం విస్మరిస్తున్నారు. ఫలితంగా వాటి బకాయిలు భారీగా పేరుకుపోయాయి.

కాలం చెల్లడంతో ఖాళీ చేయించారు

శివాజీచౌక్‌లోని మార్కెట్ ప్రాంతంలో గల 56 షాపుల్లో 1నుంచి 19వ నంబర్ వరకు గల దుకాణాలు మాత్రమే ప్రస్తుతం నడుస్తున్నాయి. 20 నుంచి 56 వరకు గల షాపులు శిథిలావస్థకు చేరాయనే ఉద్దేశంతో ఆర్‌అండ్‌బీ అధికారుల సూచన మేరకు మున్సిపల్ అధికారులు వాటిని గతేడాది ఖాళీ చేయించారు. వాటికి సంబంధించి ఏళ్ల తరబడి అద్దె వసూలు చేయకపోవడంతో ఆ బకాయిలు రూ.93లక్షల 52వేల 447 రావాల్సి ఉంది. ప్రస్తుతం దుకాణాలను ఖాళీ చేయించడంతో వారు అద్దె చెల్లించే పరిస్థితి లేదు. దీంతో బకాయిలను ఏ విధంగా రాబట్టుకుంటరనేది ప్రశ్నార్థకమే. ఇక మున్సిపల్ కార్యాలయం కింద గల షాపులకు సంబంధించి అద్దెలపై అధికారుల్లోనే స్పష్టత లేదు. ఇక్కడి షాపుల అద్దె బకాయిలు రూ.6,59,000 పెండింగ్ ఉందని చెబుతున్నారు. కానీ అక్కడే ఉన్న రెండు షాపుల అద్దె రూ.10లక్షల వరకు రావాల్సి ఉందని వారే చెబుతుండడం గమనార్హం. ఈ లెక్కన అద్దె బకాయిలపై అధికారులకే స్పష్టత లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బకాయిల వసూలుపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

షాపులవారీగా సమీక్షించి చర్యలు

మున్సిపల్ వ్యాపార సముదాయాలకు సంబంధించి అద్దె బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాం. దీర్ఘకాలంగా చెల్లించనటువంటి కొన్ని షాపులకు ఇది వరకే నోటీసులు జారీ చేశాం. మిగతా బకాయిలకు సంబంధించి షాపుల వారీగా సమీక్షించి వసూలు చేసేలా చర్యలు తీసుకుంటాం. చెల్లించని షాపులను ఖాళీ చేయించి టెండర్ల ద్వారా కొత్త వారికి కేటాయిస్తాం.
– ఎండీ.ఖమర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్

తెరపైకి 'బొజ్జు'

- డీసీసీ అధ్యక్షుడిగా నియామకంపై పార్టీ పరిశీలన
- ఖానాపూర్ ఎమ్మెల్యేకు బాధ్యతలు ఇచ్చే యోచన
- గతంలో బీఆర్ఎస్ విధానంపై కాంగ్రెస్ సమీక్ష
- ఎన్నికల నేపథ్యంలో పార్లమెంట్ ఇన్‌చార్జిగా కూడా..?


ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

సాక్షి,ఆదిలాబాద్: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా వెడ్మ బొజ్జు పేరు తెరపైకి వస్తుంది. ఖానాపూర్ ఎమ్మెల్యేకు ఈ బాధ్యతలు అప్పగించే యోచనలో పార్టీ ఉందని సమాచారం. జిల్లా నుంచి పలువురు నాయకులు ఈ పీఠాన్ని ఆశిస్తుండగా, ఇతరులకు పార్టీ బాధ్యతలు ఇస్తే ఎలా ఉంటుంది.. ఎమ్మెల్యేకు అప్పగిస్తే ఎలాగుంటుంది అనే విషయంలో సమీక్ష చేసినట్లు తెలుస్తోంది. ప్రధానంగా ప్రస్తుతం జిల్లా పరిధిలో ఆదిలాబాద్, బోథ్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉండటం, కేవలం ఖానాపూర్‌లోనే పార్టీ ఎమ్మెల్యే ఉన్న పరిస్థితిలో దీటుగా ఎదుర్కొనేందుకు ఆస్కారం ఉంటుందని పార్టీ ఆలోచిస్తున్నట్లు చెప్పుకుంటున్నారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందే ఈ నిర్ణయం వెలువడే అవకాశం ఉందంటున్నారు.

బీఆర్ఎస్ విధానం అనుసరణ..

గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పలు జిల్లాల్లో అప్పటి ఎమ్మెల్యేలకే పార్టీ బాధ్యతలు అప్పగించిన విధానాన్నే కాంగ్రెస్ అనుసరిస్తుందన్న టాక్ వ్యక్తమవుతుంది. ఈ నేపథ్యంలోనే జిల్లాలో సంక్షేమ పథకాల అమలుతో పాటు ప్రజల్లోకి తీసుకెళ్లడం, పార్టీ కార్యక్రమాల నిర్వహణలో ముందుండేందుకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జే సరి అని పార్టీ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. పార్లమెంట్ ఎన్నికలకు ముందే ఈ నిర్ణయాన్ని వెలువర్చేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే పార్టీ జిల్లా అధ్యక్ష పదవిని ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి, తలమడుగు జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి ఆశిస్తున్నారు. మరో ఒకరిద్దరు నాయకులు కూడా తెరవెనుక ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే అధ్యక్ష పదవిని ఇతర నేతలకు ఇస్తే పూర్తి జిల్లాపై వారు పట్టు సాధించగలుగుతారా.. లేదా అనేది పార్టీలో చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం నియోజకవర్గ ఇన్‌చార్జులుగా ఎమ్మెల్యేలు లేని చోట అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలైన అభ్యర్థులే వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ అధ్యక్షుడిగా ఇతరులను నియమించిన పక్షంలో నియోజకవర్గ ఇన్‌చార్జిలతో ఏ వైన ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతాయా అ నే అంశం కూడా చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. దీంతోనే ఎమ్మెల్యే అయితేనే జిల్లా మొత్తంగా కంట్రోల్ చేసుకునే పరిస్థితి ఉంటుందని పార్టీ అభిప్రాయానికి వచ్చిందనే చర్చ సాగుతోంది.

పార్లమెంట్ ఇన్‌చార్జిగా కూడా..

త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్ పార్లమెంట్‌కు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా వెడ్మ బొజ్జునే నియమించనున్నట్లు తెలుస్తోంది. ఈ సెగ్మెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలపై ఖానాపూర్ ఎమ్మెల్యేకు పూర్తి అవగాహన ఉన్న దృష్ట్యా పార్టీ ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. త్వరలోనే దీనిపై కూడా నిర్ణయం వెలువడనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి ఈ పార్లమెంట్ పరిధిలో ఏకైక ఎమ్మెల్యే కావడంతో పాటు ఆయా నియోజకవర్గాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకోవడం ద్వారా ఎన్నికలకు దీటుగా ముందుకెళ్లేందుకు ఆస్కారం ఉంటుందని పార్టీ వర్గాలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఏదేమైనా ప్రస్తుతం హస్తం పార్టీలో ఈ అంశాలు చర్చనీయాంశంగా మారాయి.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: మైనార్టీ స్టడీ సర్కిల్, సంక్షేమ శాఖ హైదరాబాద్ ఆధ్వర్యంలో అందించనున్న గ్రూప్–1 ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రాథోడ్ రమేశ్ ప్రకటనలో తెలిపారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన మైనార్టీ అభ్యర్థులకు 45 రోజుల పాటు ఉచిత శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 20లోగా జిల్లా మైనార్టీ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ మార్కుల మెమో జిరాక్స్ ప్రతులను జాత చేయాలని పేర్కొన్నారు. వివరాలకు 94403 32859 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అంబేడ్కర్‌ఓవర్సీస్ విద్యానిధికి దరఖాస్తులు..

విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించేందుకు గాను అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధిశాఖ అధికారి సునీతకుమారి ప్రకటలో తెలిపారు. ఆసక్తి, అర్హత గల ఎస్సీ విద్యార్థులు ఈ నెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సభ సక్సెస్‌ను వారు జీర్ణించుకోవడం లేదు..

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్


మాట్లాడుతున్న పాయల్ శంకర్

కైలాస్‌నగర్: ప్రధాని మోదీ ఆదిలాబాద్ విజయ సంకల్పయాత్ర విజయవంతం కావడాన్ని బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని, అందుకే తప్పుడు విమర్శలు చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లా నుంచి రాష్ట్రంలోని పలు అభివృద్ధి పనులకు ప్రధాని శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయడం జిల్లాకు గౌరవంగా భావిస్తున్నామన్నారు. 43 ఏళ్ల తర్వాత ప్రధాని రావడంతో ప్రజలు పండగ వాతావరణంలో సభకు తరలివచ్చి విజయవంతం చేశారన్నారు. అలాగే రాజకీయాలకతీతంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రధానికి స్వాగతం పలికేందుకు రావడం, మోదీని రాష్ట్రానికి పెద్దన్నలా వ్యవహరించి మాట్లాడటం జిల్లా అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుందన్నారు. ఇది మంచి పరిణామమని, అయితే దీన్ని కాంగ్రెస్, బీజేపీ దోస్తీలా బీఆర్ఎస్ చిత్రీకరించి విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. సభకు తరలివచ్చి జయప్రదం చేసిన ప్రజలు, అందుకు సహకరించిన అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్, నాయకులు వి.ఆదినాథ్ .విజయ బోయర్, ప్రవీణ్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో లబ్ధి కోసమే మోదీ పర్యటన

- డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి


మాట్లాడుతున్న అడ్డి భోజారెడ్డి

కైలాస్‌నగర్: ప్రధాని మోదీ పర్యటన పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి కోసమే సాగింది తప్ప జిల్లాకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి ఆరోపించారు. స్థానిక ప్రజాసేవ భవన్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీని గెలిపించి మోదీకి కానుకగా ఇస్తే ఐదేళ్లలో జిల్లాకు ఏమి చేశారని ప్రశ్నించారు. గిరిజన వర్సిటీ, టెక్స్‌టైల్ పార్క్, విమానాశ్రయం, సీసీఐ పునఃప్రారంభం, ఆదిలాబాద్– ఆర్మూర్ రైల్వేలైన్, హైదరాబాద్– నాగ్‌పూర్ ఇండస్ట్రియల్ కారిడార్ వంటి దీర్ఘకాలిక డిమాండ్లలో ఏ ఒక్క దాన్ని ప్రకటించకుండా మోదీ జిల్లా ప్రజలకు తీవ్ర నిరాశను మిగిల్చారన్నారు. యువతకు ఉద్యోగాల కల్పనకు పెద్దపీట వేయడంతో పాటు గత సీఎంలకు భిన్నంగా రేవంత్‌రెడ్డి జిల్లాలో రెండు సార్లు పర్యటించారన్నారు. అలాంటి తమ ప్రభుత్వాన్ని మోదీ బీఆర్ఎస్‌తో పోల్చుతూ విమర్శలు చేయడం సరికాదన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో మోదీ సర్కారు ఓడిపోవడం ఖాయమన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు నగేశ్, సంతోష్‌రావు, ఆశమ్మ, షకీల్, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ బంధం బట్టబయలైంది

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రామన్న


మాట్లాడుతున్న జోగు రామన్న

కైలాస్‌నగర్: జిల్లాలోని పెండింగ్ సమస్యలకు మోదీ పరిష్కారం చూపుతారని ఎంతో ఆశతో సభకు వచ్చిన ప్రజలను ప్రధాని నిరాశకు గురిచేశారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్ – ఆర్మూర్ రైల్వేలైన్, సీసీఐ పునరుద్ధరణ, మెగా టెక్స్‌టైల్ పార్కు, ఎయిర్‌పోర్టు వంటి వాటి పరిష్కారం కోసం ప్రజలు గంపెడాశతో ఉంటే వాటిలో ఏ ఒక్కదాన్ని ప్రకటించకుండా ఈ ప్రాంతవాసుల ఆశలపై ప్రధాని నీళ్లు చల్లారన్నారు. ఇతర జిల్లాల్లో చేపట్టబోయే ప్రాజెక్టులకు జిల్లా నుంచి ప్రారంభోత్సవాలు చేయడమంటే జిల్లా ప్రజలను అవమానించడమేని మండిపడ్డారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఎయిర్‌పోర్టు, సీసీఐ పునప్రారంభం జరగలేదని విమర్శలు చేసిన ఎంపీ, ఎమ్మెల్యేలు ఇప్పుడేం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీల అంతర్గత బంధం బట్టబయలయ్యేలా ప్రధాని పర్యటన సాగిందని విమర్శించారు. ఆదివాసీలపై కపట ప్రేమ చూపుతున్న బీజేపీ సిట్టింగ్ ఎంపీగా ఉన్న ఆదివాసీకి ఎందుకు టికెట్ ప్రకటించలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రస్తావించకపోవడమే కాకుండా గతంలో ఇచ్చిన హామీలపై కనీసం స్పష్టత ఇవ్వలేదన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు రమేశ్, పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్, నారాయణ, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడులు తెరిచే నాటికే యూనిఫాం

- వచ్చే విద్యాసంవత్సరం మొదటి రోజే పంపిణీ
- కుట్టుపని బాధ్యత 'పొదుపు' మహిళలకే..
- ఉమ్మడి జిల్లాకు రూ.2.11 కోట్ల కుట్టుకూలి కేటాయింపు
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర విద్యాశాఖ

జిల్లాలవారీగా వివరాలు...

జిల్లా	విద్యార్థుల సంఖ్య	స్టిచ్చింగ్ నిధులు (రూ.లలో)
నిర్మల్	52,264	52,26,400
ఆదిలాబాద్	67,418	67,41,800
మంచిర్యాల	43,714	43,71,400
కుమురంభీం	48,248	48,24,800


తరగతి గదిలో చదువులో నిమగ్నమైన విద్యార్థులు

నిర్మల్‌ఖిల్లా/మంచిర్యాలఅర్బన్: ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం రాష్ట్ర సర్కారు ప్రణాళికలు సిద్ధం చేస్తుంది. పలురకాల సౌకర్యాల కల్పనకు పాఠశాల విద్యాశాఖ శ్రీకారం చుడుతోంది. ఇందులో భాగంగా 2024–25 విద్యా సంవత్సరానికి పాఠశాలల పునఃప్రారంభం రోజే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరికీ రెండు జతల ఏకరూప దుస్తుల పంపిణీకి కసరత్తు ప్రారంభించింది. ఒక్కో జతకు కుట్టుకూలిగా రూ.50 చొప్పున రెండు జతలకు రూ.100 చెల్లించడానికి నిధులను కేటాయించింది. ఈ మేరకు జిల్లాల వారీగా విద్యార్థుల సంఖ్య ఆధారంగా కుట్టుకూలి చార్జీలు, యూనిఫామ్ ఆకృతులతో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రైవేటును మైమరిపించేలా..

పేద, దిగువ మధ్యతరగతి విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థులకు ఆకట్టుకునే రీతిలో యూనిఫామ్ ఆకృతులను గతేడాది నిర్దేశించింది. అయితే పాఠశాలలు ప్రారంభమైన తర్వాత యూనిఫామ్ క్లాత్ పంపిణీ చేస్తే విద్యార్థులకు చేరే నాటికి ఆలస్యమవుతోందని భావించిన విద్యాశాఖ ఈసారి బడులు ప్రారంభమయ్యే రోజే విద్యార్థులకు అందించేలా ప్రణాళిక రూపొందించింది. బాలికలకు ఒకటి నుంచి మూడో తరగతి వరకు ఫ్రాక్‌తో కూడిన డ్రెస్, 4, 5 తరగతి చదువుతున్న వారికి స్కర్ట్, 6 నుంచి 12వ తరగతి చదువుతున్న అమ్మాయిలకు పంజాబీ డ్రెస్ కుట్టించుకునేలా ఆకర్షణీయమైన ఆకృతులను విడుదల చేశారు. ఇక బాలురకు ఒకటి నుంచి ఏడో తరగతి చదువుతున్న వారికి షర్టు, నిక్కరు.. 8 నుంచి 12వ తరగతి వారికి షర్టు, ప్యాంటుతో ఎరుపు బూడిద రంగు చెక్స్ కలిగిన క్లాత్‌ను నిర్దేశించారు.

కుట్టుపని 'పొదుపు' మహిళలకే..

తెలంగాణ రాష్ట్ర చేనేత సహకార సంఘం(టీఎస్ హ్యాండ్లూమ్ వివర్స్ కోఆపరేటీవ్ సొసైటీ) ద్వారా విద్యార్థుల యూనిఫాం క్లాత్‌ను పంపిణీ చేసి స్టిచ్చింగ్ బాధ్యతలను పొదుపు స్వయం సహాయక బృందాల మహిళలకు అప్పజెప్పనున్నారు. కుట్టుపని బాధ్యత పొదుపు సంఘాల వారికి అప్పగించడంతో ఆ మహిళలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చెందిన పాఠశాల యూనిఫాంను జూన్ 1 నాటికి సిద్ధం చేయనున్నారు. కుట్టుపనిలో నైపుణ్యం కలిగిన స్వయం సహాయక బృందాల మహిళలను గుర్తించి వారికి విద్యార్థుల కొలతలు అందించే ప్రక్రియను ఈనెల చివరినాటికి పూర్తి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి జిల్లాలోని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను ఇప్పటికే ప్రధానోపాధ్యాయుల నుంచి తెప్పించుకున్నారు. పొదుపు సంఘాల మహిళలు విద్యార్థుల కొలతలు తీసుకుని వాటి మేరకు యూనిఫామ్‌ను నిర్దేశిత ఆకృతుల్లో కుట్టాల్సి ఉంటుంది. సరిపడా వస్త్రాన్ని రాష్ట్ర చేనేత సహకార సంఘం టీఎస్ సీఈవో నుంచి వారికి అందించనున్నారు. ఇదిలా ఉండగా విద్యార్థుల వారీగా, వయసుల వారీగా యూని ఫాం స్టిచ్చింగ్ ఆకృతితో పనిభారం పెరిగిందని, కూలి రూ.50 మాత్రమే ఇస్తున్నారని కనీసం రూ.200 పెంచాలని మహిళలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

క్లుప్తంగా

బాసర లాడ్జీల్లో పోలీసుల తనిఖీ

భైంసా: బాసర మండల కేంద్రంలోని లాడ్జీల్లో మంగళవారం పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేశారు. ముధోల్ సీఐ మల్లేశ్ నేతృత్వంలో బాసర పోలీసులు తనిఖీలు చేపట్టారు. కొంతమంది యజమానులు తమ లాడ్జీల్లో అసాంఘిక కార్యకలాపాలు చేయిస్తూ పట్టుబడ్డారు. దీంతో సదరు యజమానులపై కేసులు నమోదు చేశారు. లాడ్జీల్లో అసాంఘిక కార్యకలాపాలకు ఆశ్రయం కల్పిస్తున్న యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

సీఎం ఏపీఆర్వోగా అన్వేశ్‌రెడ్డి


అన్వేశ్‌రెడ్డి

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని చైతన్యపురి కాలనీకి చెందిన పూండ్రు అన్వేశ్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అదనపు ప్రజా సంబంధాల అధికారి (ఏపీఆర్వో) గా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్వర్వులు జారీ అయ్యాయి. బేల మండలం కొగ్దూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మోహన్ రెడ్డి తనయుడైన అన్వేశ్ అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ మసాచుసెట్స్, హైదరాబాద్‌లోని అనురాగ్ యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఆదిలాబాద్ రూరల్ మండలం పొచ్చెర గ్రామానికి చెందిన అన్వేశ్ కుటుంబం 30 ఏళ్లుగా పట్టణంలో స్థిరపడింది.

తునికాకు టెండర్లు పిలవాలి

ఎదులాపురం: తునికాకు టెండర్లు వెంటనే పిలవాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంకా రాఘవులు డిమాండ్ చేశారు. ఈ విషయమై మంగళవారం జిల్లా సూపరింటెండెంట్ ఫారెస్ట్ ఆఫీసర్ సరోజకు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనులకు వ్యవసాయం తర్వాత తునికాకు రెండో పంటగా, ఉపాధిగా ఉందని తెలిపారు. అనేక మంది గిరిజనులు, గిరిజనేతరులకు ప్రధాన ఆదాయ వనరుగా ఉందని పేర్కొన్నారు. ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 194 యూనిట్లకు 26కు మాత్రమే టెండర్లు పిలిచారని తెలిపారు. పెండింగ్ యూనిట్లకు తక్షణమే టెండర్లు పిలవాలని కోరారు.

అదుపుతప్పి కారు బోల్తా

బోథ్: మండల కేంద్రంలోని ఓ జిన్నింగ్ ఫ్యాక్టరీ సమీపంలో సోమవారం రాత్రి కారు అదుపుతప్పి బోల్తా పడింది. వివరాలు.. కౌఠ గ్రామానికి చెందిన ఓ యువకుడు కారులో బోథ్ నుంచి కౌఠ బీ గ్రామానికి వెళ్తున్నాడు. కాగా, ఫ్యాక్టరీ సమీపంలో బైక్‌ను తప్పించబోగా కారు పక్కనే ఉన్న కాల్వలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. కారులోని యువకుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

రోడ్డు ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ మృతి

కామారెడ్డి క్రైం: కామారెడ్డి జిల్లా టేక్రియాల్ సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి.. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం దన్నూర్ గ్రామానికి చెందిన సయ్యద్ ఆమేర్ (30) డీసీఎం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అరటిపండ్ల లోడ్‌తో అనంతపురం వెళ్లి వస్తుండగా టేక్రియాల్ వద్ద డీసీఎం అదుపుతప్పి మట్టికుప్పలోకి దూసుకెళ్లింది. సయ్యద్ రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కొమురయ్య తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రక్తహీనతతోనే అస్వస్థత!


రిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినుల ఆరోగ్యంపై ఆరా తీస్తున్న ఆదివాసీ నేతలు

- వైద్యపరీక్షల్లో వెల్లడించిన డాక్టర్లు
- తరచూ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలల విద్యార్థినులకు అనారోగ్యం
- ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు
- సరైన పౌష్టికాహారం అందించాలంటున్న ఆదివాసీ సంఘాల నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థినుల అనారోగ్యానికి రక్తహీనతే కారణమని తెలుస్తోంది. వైద్యులు నిర్వహించిన పరీక్షల్లో ఇది వెల్లడైంది. ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 133 గిరిజన ఆశ్రమ పాఠశాలలున్నాయి. ఇందులో 77 బాలుర ఆశ్రమ పాఠశాలలుండగా ఈ విద్యా సంవత్సరం 20వేల మంది వరకు బాలురు చదువుతున్నారు. 56 బాలికల ఆశ్రమ పాఠశాలలుండగా 15వేల మంది వరకు బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. ప్రధానంగా బాలికలు తరచూ అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇందులో ఎక్కువ మంది బాలికలు రక్త హీనతతో బాధపడుతున్నవారే. రక్త నమూనాలు సేకరించి పరీక్షించగా వారి శరీరంలో తక్కువ మోతాదులోనే రక్తం ఉన్నట్లు వైద్యులు నిర్ధారిస్తున్నారు. మంగళవారం ఆదిలాబాద్ రూరల్ మండలం మామిడిగూడ ఆశ్రమ పాఠశాలతోపాటు పలు ఆశ్రమ పాఠశాలలకు చెందిన పలువురు బాలికలు అనారోగ్యంతో బాధపడుతూ రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు.

ఆందోళనలో తల్లిదండ్రులు

జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఉంటూ విద్యనభ్యసిస్తున్న బాలికలు తరచూ అనారోగ్యం బారిన పడుతుండగా వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. తోటి స్నేహితులు అనారోగ్యం బారిన పడుతుండగా వారితో కలిసి చదువుకునే విద్యార్థులు కూడా ఆందోళనకు గురికావాల్సిన పరిస్థితి నెలకొంది. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోనే చదువుతున్న బాలికలకు ఇలాంటి పరిస్థితి ఎందుకు ఎదురవుతుందో తేల్చాల్సిన ఆవశ్యకత ఉంది.

నామమాత్రంగానే శిబిరాలు

ఆశ్రమపాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినుల ఆరోగ్యాన్ని పరీక్షించేందుకు వైద్యశిబిరాలు నిర్వహించాలి. ప్రస్తుతం జిల్లాలో నామమాత్రంగానే వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. నెలనెలా వైద్యశిబిరాలు నిర్వహిస్తుండడంతో వారి ఆరోగ్య పరిస్థితి అంచనా వేసి సకాలంలో వైద్యం అందించే ఆస్కారం ఉంటుంది. ఇప్పటికైనా సక్రమంగా వైద్యశిబిరాలు నిర్వహించాల్సిన అవసరముంది.

పౌష్టికాహారం అందకనే..

ఇతరశాఖల పరిధిలో కొనసాగుతున్న వసతిగృహాల్లో ఉంటూ చదువుకుంటున్న బాలికలు అనారోగ్యం బారినపడడం లేదు. గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని వసతిగృహాల్లో ఉంటూ చదువుకుంటున్న వారే తరచూ అనారోగ్యం బారిన పడుతూ మృతి చెందుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ప్రధానంగా వారికి సరైన పౌష్టికాహారం అందకనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి.

– కుమ్ర రాజు, ఆదివాసీ సంఘం నాయకుడు

పర్యవేక్షణ కొరవడుతోంది

గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఉంటూ చదువుకుంటున్న గిరిజన విద్యార్థినులపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడుతోంది. అనారోగ్యం బారిన పడుతున్న వారికి సకాలంలో చికిత్స అందించలేకపోతున్నారు. గిరిజన సంక్షేమశాఖ ఉన్నతాధికారులకు ఫోన్ చేస్తే స్పందన లభించడం లేదు. ప్రభుత్వం గిరిజన విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన సరుకులు సరఫరా చేయాలి.

– జంగు బాపు, ఎంపీటీసీ సభ్యుడు, చించుఘాట్

పౌష్టికాహారం తీసుకోవాలి



గిరిజన వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థినుల్లో చాలామంది రక్త హీనతతో బాధపడుతున్నారు. బాలికలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలి. అలాగే నెలనెలా ఆరోగ్య పరీక్షలు చేసుకుంటే బాగుంటుంది. దీంతో ఆరోగ్యంలో ఎలాంటి లోపాలున్నా వారు సకాలంలో చికిత్స చేయించుకోవడానికి ఆస్కారం ఉంటుంది.

– డాక్టర్ సుమలత, అసోసియేట్ ప్రొఫెసర్, రిమ్స్

న్యూట్రిషన్ ఫుడ్ అందించాలి



రెండురోజుల కిందట జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కతో కలిసి గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించాం. చాలామంది బాలికలు రక్త హీనతతో బాధపడుతున్నారు. విద్యార్థినుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకునేలా చూడాలని ఉన్నతాధికారులకు తెలిపాం. వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థినులకు న్యూట్రిషన్ ఫుడ్ అందించేలా చర్య తీసుకుంటున్నాం.

– వెడ్మ బొజ్జుపటేల్, ఎమ్మెల్యే, ఖానాపూర్

మున్నూరుకాపుల సంక్షేమానికి కృషి చేయాలి


సమావేశానికి హాజరైన మున్నూరుకాపులు

ఆదిలాబాద్‌రూరల్: మున్నూరుకాపుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తాలూకా మున్నూరుకాపు సంఘ భవనంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మున్నూరుకాపుల సంక్షేమానికి ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని విస్మరించిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఫైనాన్స్ కార్పొరేషన్, ప్రతీ జిల్లా కేంద్రంలో బాలబాలికలకు వసతి గృహాలు ఏర్పాటు చేయాలని కోరారు. కోకాపేటలో ఆత్మగౌరవ భవన నిర్మాణం కోసం రూ.20 కోట్లు కేటాయించాలని, పార్లమెంట్ ఎన్నికలకు ముందే సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్ తాలుకా మున్నూరుకాపు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విఠల్, శ్రీనివాస్, ఎండీఏఫ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఎడ్ల రవి, యువత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, కన్వీనర్ చింత పండు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: కాంగ్రెస్ సర్కార్ తమ మేనిఫెస్టోలో పొందుపరిచినట్లు మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్యపటేల్ కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటుతోపాటు రెండెకరాల భూమి, మున్నూరుకాపు బాలబాలికల భవన నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరు చేయాలని, కోకాపేట్‌లో మున్నూరుకాపు ఆత్మగౌరవ భవన నిర్మాణానికి కృషి చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ రంగంలో ఉన్న కులబాంధవులకు సముచిత ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేశారు. నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, తెలంగాణ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎంసీ లింగన్న, అయ్యన్నగారి భూమయ్య, ధర్మాజీ రాజేందర్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుడి ఆత్మహత్య

జైనథ్: మండల కేంద్రంలోని జ్యోతీబాపూలే కాలనీకి చెందిన ఇప్ప సుధాకర్ (36) మద్యం మత్తులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సుధాకర్ గతేడాది ఇంటికి గోడలకు రంగులు వేస్తుండగా నిచ్చెన జారి కింద పడ్డాడు. తీవ్ర గాయాలు కాగా, ఆస్పత్రిలో చికిత్స పొందాడు. అయినప్పటికీ నొప్పులు తగ్గలేదు. దీంతో సుధాకర్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ సభ్యులు వారించినా వినిపించుకోలేదు. దీంతో రెండురోజుల క్రితం సుధాకర్ భార్య పుట్టింటికి వెళ్లింది. మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సుధాకర్ దూలానికి చీరెతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి అన్న వామన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు. జ

మోకాలి నొప్పులు భరించలేక వృద్ధుడు..

జైనథ్: మండల కేంద్రంలోని చిలకలగూడ గ్రామానికి చెందిన కనక్ రాందాస్ (78) మోకాలి నొప్పులు భరించలేక ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వయస్సు పైబడడంతో రాందాస్ తరచూ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీనికి తోడు మోకాలి నొప్పులు ఎక్కువయ్యాయి. నొప్పులు భరించలేక మంగళవారం మధ్యాహ్నం ఇంటి ఎదుట ఉన్న గదిలో దూలానికి తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి కుమారుడు గంగారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు.

పేదరికానికి అనారోగ్యం తోడై..

తాంసి: అసలే పేదరికం, పైగా అనారోగ్యం తోడవడంతో వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. భీంపూర్ మండలం పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన ఐనవెల్లి నర్సింహులు (64) కూలీ పని చేస్తూ జీవించేవాడు. కొంతకాలంగా పక్షవాతంతో బాధ పడుతున్నాడు. అసలే పేదరికం, ఆపై అనారోగ్యం తోడవగా భరించలేక మంగళవారం వేకువజామున గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు లచ్చన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రదీప్‌కుమార్ తెలిపారు.

గుడుంబా నిర్మూలనకు సహకరించాలి

కడెం: గుడుంబా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ రజాక్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో ఐదు టన్నుల బెల్లం, 36 క్వింటాళ్ల పటిక స్వాధీనం చేసుకుని మండల కేంద్రానికి చెందిన అజార్, షకీల్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎవరైనా గుడుంబా విక్రయిస్తే 8712658744 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట ఎక్సైజ్ సీఐ గంగారెడ్డి, ఎస్సై వసంత్, సిబ్బంది ఉన్నారు.

బ్రెయిన్ ఇన్‌ఫెక్షన్‌తో కోమాలోకి..

- ఐసీయూలో చికిత్స పొందుతున్న మహిళ
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు


ఐసీయూలో ప్రియాంక

జైనథ్: మండలంలోని సాంగ్వి–కే గ్రామానికి చెందిన బొల్లి రాకేశ్ భార్య ప్రియాంక బ్రెయిన్ ఇన్‌ఫెక్షన్‌తో కోమాలోకి వెళ్లిపోయింది. పదిరోజులుగా మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లోగల ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఇప్పటివరకు వైద్యం కోసం రూ.4లక్షలు ఖర్చయింది. ఆమెకు ప్లాస్మా తెరపీ కోసం మరో రూ.6లక్షలు అవసరమున్నట్లు వైద్యులు తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన రాకేశ్ తన వద్ద డబ్బులు లేక దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నాడు. దాతలు స్పందించి తన ఫోన్ పే నంబర్ 9640586643కు డబ్బులు పంపించి తన భార్యను బతికించాలని వేడుకుంటున్నాడు.

బంగారు ఆభరణాలు చోరీ చేసిన మహిళ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న పట్టణ సీఐ అనిల్

నిర్మల్‌టౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బంగారు ఆభరణాలు దొంగిలించిన మహిళను మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. పట్టణ సీఐ అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని సిద్ధాపూర్ కాలనీకి చెందిన లావణ్య గతేడాది అక్టోబర్ 28న బంధువుల ఇంటికి వెళ్తూ ఐదుతులాల బంగారు ఆభరణాలను పర్సులో పెట్టుకుని నిర్మల్ బస్టాండ్‌కు వెళ్లింది. గమనించిన నిజామాబాద్ జిల్లా నందిపేట్‌కు చెందిన జనగామ ఇంద్ర బస్టాండ్‌లో పర్సు దొంగిలించి పారిపోయింది. ఈ మేరకు లావణ్య పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో మంగళవారం స్థానిక బస్‌డిపో బోయివాడ హనుమాన్ టెంపుల్ వద్ద సీసీ కెమెరాల సాయంతో ఆమెను పోలీసులు పట్టుకున్నారు. బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకుని ఆమెను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు సీఐ తెలిపారు.

రెండుసంస్థలతో ట్రిపుల్‌ఐటీ ఒప్పందం


ఒప్పందం చేసుకుంటున్న వీసీ వెంకటరమణ

భైంసా: హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ వేదికగా పలు సంస్థలతో బాసర ట్రిపుల్‌ఐటీ వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ అవగాహన ఒప్పందం చేసుకున్నారు. మంగళవారం యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్, మెడ్‌సైంటిస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థలతో ట్రిపుల్‌ఐటీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ తెలిపారు. సంస్థలకు సంబంధించిన అధికారులతో ఒప్పందపత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. విద్యార్థుల అవసరాలను అన్వేషించి వారిని ప్రోత్సహించే దిశగా ఈ సంస్థలు సహకరిస్తాయని తెలిపారు. ప్రస్తుత విద్యానైపుణ్యాలతో ప్లేస్‌మెంట్ సెల్‌ను బలోపేతం చేసేందుకు ఇలాంటి ఒప్పందాలు ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్స్ సృజన, డాక్టర్ పావని, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ మహేశ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అధ్యాపకుల శిక్షణ


గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌తో బాసర ట్రిపుల్ ఐటీ వీసీ, అధ్యాపకులు

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీ అధ్యాపకుల శిక్షణ ముగిసింది. మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థ వేదికగా రెండురోజులపాటు అధ్యాపకుల శిక్షణ మంగళవారం కొనసాగింది. ముగింపు కార్యక్రమానికి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ హాజరై అధ్యాపకులను అభినందించారు. రెండోరోజు మొదటి సెషన్‌లో ట్రిపుల్‌ఐటీ వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ మాట్లాడుతూ.. అధ్యాపకులు సమాజంలో వస్తున్న మార్పులను గమనిస్తూ ఇందుకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని తెలిపారు. శిక్షణ కార్యక్రమాలు అధ్యాపకులకు ఎంతగానో ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. అనంతరం 'క్యాంపస్ టూ కార్పొరేట్' అనే అంశంపై పలువురు పారిశ్రామిక వేత్తలతో ముఖాముఖి నిర్వహించారు. పారిశ్రామికవేత్త రాజిరెడ్డి, కార్పొరేట్ సీఈవో శ్రీలత, అసోసియేట్ డీన్స్ పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో రాణించడం అభినందనీయం


క్రీడాకారులకు ట్రోఫీ ఇస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

నేరడిగొండ: జాతీయస్థాయి పోటీల్లో క్రీడాకారులు స్వర్ణ పతకాన్ని సాధించి మొదటి స్థానంలో నిలవడం అభినందనీయమని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో ఇటీవల జరిగిన 41వ జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ నుంచి మొదటి స్థానంలో నిలిచి స్వర్ణ పతకాన్ని సాధించిన నేరడిగొండ కేజీబీవీ విద్యార్థినులు డీ శిరీష, ఎం.అలేఖ్య, బీ వనితను అభినందించారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో క్రీడాకారులకు ట్రోఫీ అందజేశారు. అనంతరం మండల కేంద్రంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ కూడా క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణకు గౌరవాన్ని దక్కించిన క్రీడాకారులను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ముందుకుసాగాలని సూచించారు. పీఈటీ స్నేహ ప్రోత్సాహంతోనే తాము ఈ ఘనత సాధించామని విద్యార్థినులు తెలిపారు. కాగా, పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని కలెక్టర్‌తోపాటు బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అభినందించారు.

కూలిన వంతెన


కూలిన వంతెనను పరిశీలిస్తున్న రైతులు

- మరమ్మతు చేయాలంటున్న రైతులు

కుంటాల: మండలంలోని కల్లూర్–పాత బూరుగుపల్లి తిమ్మాపూర్ జోడు వాగులపై నిర్మించిన వంతెన మంగళవారం ఉదయం కూలింది. ఆ సమయంలో వంతెన పైనుంచి వాహనాలు, ప్రజల రాకపోకలు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... వంతెనకు ఏడు పిల్లర్లున్నాయి. గత వానాకాలంలో కురిసిన భారీ వర్షాలకు మధ్యలోని పిల్లర్‌కు దాదాపు ఫీటున్నర పగుళ్లు తేలాయి. దీంతో వంతెన కుంగగా ఎవరూ గమనించలేదు. మంగళవారం ఉదయం వంతెన పైనుంచి ఓ భారీ వాహనం వెళ్లడంతో అది కూలిందని రైతులు తెలిపారు. వాగులోని నీటిని విద్యుత్ మోటార్ల ద్వారా పంటలకు అందిస్తారు. వంతెన కూలిన సమయంలో కింద ఉన్న విద్యుత్ మోటార్లు, పైపులు దెబ్బతిన్నాయని ఈ సందర్భంగా రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

30 ఏళ్ల కిందట నిర్మాణం

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నిర్మించే సమయంలో మండలంలోని బూరుగుపల్లి గ్రామాన్ని 1978లో ఖాళీ చేయించి అర్లి(కే) 61 జాతీయ రహదారి పక్కన పునరావాసం కల్పించారు. బూరుగుపల్లి (కే) గ్రామానికి చెందిన రైతుల వ్యవసాయ భూములు వాగు అవతల ఉండగా 30 ఏళ్ల కిందట కల్లూర్ –పెండ్‌పల్లి గ్రామాల మధ్య వంతెన నిర్మించారు. దీంతో వ్యవసాయ భూములకు వెళ్లడంతో పాటు లోకేశ్వరం మండలంలోని బిలోలి, సాత్‌గాం, పెండ్‌పల్లి, లోకేశ్వరం తదితర గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగుపడింది. ప్రస్తుతం మక్క, నువ్వు, జొన్న తదితర పంటలు కోత దశకు వచ్చాయి. వంతెన కూలిపోగా సాగునీటికి ఇబ్బందులు తప్పవని రైతులు పేర్కొంటున్నారు. త్వరగా మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.

మరమ్మతు చేపట్టాలి



వాగు అవతలి వైపు మా భూములున్నాయి. ప్రతిరోజూ పంట పొలాలకు తప్పనిసరిగా వెళ్తుంటాం. వంతెన కూలిపోవడంతో ఇబ్బందులు తప్పవు. త్వరగా వంతెనకు మరమ్మతు చేపట్టాలి.

– లక్ష్మణ్‌పటేల్, రైతు, కల్లూర్

ప్రమాదం తప్పింది



వంతెన కూలడానికి అరగంట ముందు నా కొడుకు, మనుమరాలితో ద్విచక్ర వాహనంపై దానిపైనుంచి వెళ్లి వచ్చిన. పెను ప్రమాదం తప్పింది. ప్రభుత్వం వెంటనే వంతెనకు మరమ్మతు చేపట్టాలి.

– గంగాధర్ పటేల్, రైతు, బూరుపల్లి (కే)

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన మహిళా కమిషన్ సభ్యురాలు


విద్యార్థినులతో మాట్లాడుతున్న ఈశ్వరీబాయి

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చిచ్‌ధరి ఖానాపూర్ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి మంగళవారం సందర్శించారు. విద్యార్థినులకు కల్పిస్తున్న వసతి, సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు సమీపిస్తున్న వేళ భయం వీడి పరీక్షలకు ధైర్యంగా సిద్ధం కావాలని పదో తరగతి విద్యార్థులకు సూచించారు. అంతకుముందు పాఠశాల పరిసరాలు, వంట సామగ్రి, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. క్రీడల్లో ప్రతిభ కనబర్చిన తొమ్మిదో తరగతి విద్యార్థినికి బహుమతి అందజేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఆమె వెంట ప్రధానోపాధ్యాయుడు అరవింద్ కుమార్, కుమ్రం సూరు యువసేన జిల్లా అధ్యక్షుడు కుమ్ర రాజు, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

నిర్మించారు.. వదిలేశారు



నేరడిగొండ మండల కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన వృథాగా మంచినీటి ట్యాంక్

- నీటి ట్యాంకుల నిర్వహణ అస్తవ్యస్తం
- తాగునీటికి ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

నేరడిగొండ: డివిజన్‌లోని పెన్‌గంగ ఫోర్‌లైన్ జాతీయ రహదారి నుంచి నిర్మల్ డివిజన్‌లోని సోన్ బ్రిడ్జి జాతీయ రహదారి (బైపాస్) వెంట ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు నిర్మించిన నీటి ట్యాంకుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. వీటి నిర్వహణను కొద్దికాలంగా గాలికి వదిలేశారు. నీటి ట్యాంకుల్లో నీటిని అందుబాటులో ఉంచాల్సిన నిర్వాహకులు తమ బాధ్యతను విస్మరిస్తున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా రహదారిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో రహదారి వెంబడి పలు చోట్ల నిర్మించిన వాటర్ ట్యాంకుల్లో నీరు కరువవుతోంది. చుక్కనీరు లేకుండా ట్యాంకులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

నిర్వహణ మరిచారు..

జాతీయ రహదారుల పక్కన బస్‌స్టాప్‌ల ప్రయాణికుల సౌకర్యార్థం వాటర్ ట్యాంకులు నిర్మించారు. రహదారి పొడవున బస్టాప్‌ల వద్ద సుమారుగా 60 వరకు వాటర్ ట్యాంక్‌లను నిర్మించగా ఒక్కోదానికి సుమారుగా రూ.30వేల వరకు వెచ్చించారు. అయితే వీటి నిర్వహణ బాధ్యత అంతా రహదారి నిర్మించిన గుత్తేదారులు చూసుకోవాల్సి ఉంటుంది. వీటిని ప్రతీరోజు పర్యవేక్షించాలి. నీటిని వాటిలో అందుబాటులో ఉంచాలి. ఎప్పటికప్పుడు వాటిని శుభ్రపర్చాలి. తాగునీటిని అందించేలా చూడాలి. కానీ వీటి నిర్వహణ ఎవరూ పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారులు కూడా వీటిని నిత్యం పర్యవేక్షించాలి. తమ దృష్టికి వచ్చిన సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి. అయితే అధికారులు సైతం వీటిపై దృష్టి సారించకపోవడంతో నీటి ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. కానీ అత్యవసర సమయంలో ప్రయాణికులు నీటి కోసం వీటిని ఆశ్రయిస్తున్నారు. అధికారులు వాటర్ ట్యాంకులను వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు.



లఖంపూర్ జాతీయ రహదారి పక్కన నిరుపయోగంగా వాటర్ ట్యాంక్

ట్యాంకుల్లో నీటి సౌకర్యం కల్పించండి




ఎన్‌హెచ్‌ఏఐ పక్కన బైపాస్ రహదారి వెంట నీటి ట్యాంకులు నిర్మించారు. ప్రయాణికుల దాహార్తి కోసం నిర్మించిన ఈ ట్యాంకుల్లో నీరు ఉండటం లేదు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ఈ ట్యాంకులను శుభ్రపర్చి నీటి సౌకర్యం కల్పించాలి.

– తొడసం శంకర్, తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు

నీటి సౌకర్యం కల్పించేలా ఆదేశాలిస్తాం..

బైపాస్ పక్కన నిరుపయోగంగా మారిన మినీ ట్యాంకుల్లో నీటి సౌకర్యం కల్పించేలా సంబంధిత గుత్తేదారులకు ఆదేశాలు జారీ చేస్తాం. ప్రయాణికుల దాహార్తిని తీర్చేలా చర్యలు చేపడతాం.

– సి.శ్రీనివాస్ రావు, ఎన్‌హెచ్‌ఏఐ పీడీ



ఇచ్చోడ: పంట పొలాల్లో ప్రకృతి అందాలు కనువిందు చేస్తున్నాయి. ఇచ్చోడ మండలంలోని కోకస్‌మన్నూర్‌లో ఓ రైతు పొలంలో పక్కపక్కనే ఉన్న ఓ మోదుగు చెట్టు ఎరుపుపూలతో ఆకర్షిస్తుంటే.. దాని పక్కనే ఉన్న మరో చెట్టు ఆకుపచ్చ వర్ణంతో మదిని పులకరింపజేస్తోంది. ఈ రెండు చెట్లు ఎరుపు, ఆకుపచ్చ వర్ణాలతో వీక్షకులను ఆకట్టుకుంటుంటే వీటికి పోటీగా ఆకాశం నీలిరంగు వర్ణంతో కనువిందు చేస్తున్న దృశ్యాన్ని సాక్షి క్లిక్ మనిపించింది.

క్లుప్తంగా

కాంగ్రెస్ ఇన్‌చార్జి గజేందర్‌ను కలిసిన నాయకులు

ఇచ్చోడ: కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌ను ఇచ్చోడ, సిరికొండ మండలాల కాంగ్రెస్ నాయకులు మంగళవారం కలిశారు. రెండు మండలాల్లో పెండింగ్‌లోని పనులకు నిధులు మంజూరు చేసే విధంగా కృషి చేయాలని వినతిపత్రం అందజేశారు. ఇందులో సిరికొండ మండల నాయకులు ఇమామ్, మాదవ్ పటేల్, ఇచ్చోడ మండల నాయకులు షాదుల్లా, మోహరాజ్ అహ్మద్, పట్ల గోవర్ధన్, శివన్న ఉన్నారు.

నేడు బీఆర్‌ఎస్ ధర్నా

బోథ్: ఎల్‌ఆర్‌ఎస్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల నుంచి వేల కోట్ల రూపాయలు దండుకోవాలని చూస్తోందని, దీనికి నిరసనగా బుధవారం నియోజకవర్గ కేంద్రమైన బోథ్‌లో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు బీఆర్‌ఎస్ నాయకులు ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఉదయం 9.30లకు జరిగే ధర్నా కార్యక్రమానికి బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

నేడు ఆధునిక సాంకేతికతపై అవగాహన

ఇచ్చోడ: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని రైతు వేదికలో బుధవారం ఆధునిక సాంకేతిక విధానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వ్యవసాయ అధికారి జాదవ్ కైలాస్ తెలిపారు. మంగళవారం ఆయన ఇచ్చోడలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం రేవంత్ రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కార్యక్రమంలో హైదరాబాద్ నుంచి పాల్గొననున్నట్లు తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



ఎదులాపురం: తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. ముఖ్యమంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టిన నాటి నుండి నాలుగో తరగతి ఉద్యోగులకు ప్రతినెల మొదటి తేదీన జీతాలు అందిస్తుండటంపై హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కార్యదర్శి ఇంద్ర, జిల్లా సహాయ అధ్యక్షుడు రమేశ్, సంయుక్త కార్యదర్శి ప్రవీణ్, ఉపాధ్యక్షుడు అయ్యుబ్ ఖాన్ పాల్గొన్నారు.

మీసేవ కేంద్రాల తనిఖీ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని పలు మీ సేవ కేంద్రాలను ఈడీఎం బండి రవి మంగళవారం తనిఖీ చేశారు. మున్సిపల్ కార్యాలయం, దస్నాపూర్, భుక్తాపూర్‌లోని మీసేవ కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల పనితీరు, వాటి ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల కోసం ఎలాంటి అధిక రుసుం వసూలు చేయవద్దని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి సౌకర్యం కలిగించకుండా సకాలంలో సేవలందించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎదులాపురం: ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్ ఆదిలాబాద్‌లో ఖాళీగా ఉన్న కెమిస్ట్రీ ఉర్దూ మీడియం అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. అభ్యర్థులు పీజీ సంబంధిత సబ్జెక్టులో కనీసం 55% మార్కులు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50శాతం మార్కులు కలిగి ఉన్నా అర్హులేనన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 9వ తేదీలోగా కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని, 11వ తేదీ ఉదయం 10గంటల నుంచి జరిగే డెమోకు హాజరు కావాలని కోరారు.

'ప్రజా సమస్యలపై గళం ఎత్తడానికే రాజకీయాల్లోకి'



ప్రజలతో మాట్లాడుతున్న దౌలత్‌రావ్

ఆదిలాబాద్‌రూరల్: చట్ట సభల్లో ప్రజా సమస్యలపై గళం ఎత్తడానికే ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తున్నట్లు ఆదివాసీ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కోవ దౌలత్‌రావ్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. అంతకుముందు మండలంలోని వాన్‌వాట్ బాలుర, మామిడిగూడ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు.

ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకోవాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తాంసి: మానసిక ప్రశాంతతకు ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం తాంసి మండలంలోని పొన్నారి గ్రామంలో శ్రీఆంజనేయ విగ్రహ ప్రథమ వార్షికోత్సవ పూజ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని పూజలు చేశారు. అనంతరం జిల్లా పరిషత్ పాఠశాలలో స్మార్ట్ టీవీ బోధన సైతం ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తాటిపెల్లి రాజు, ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, వైస్ ఎంపీపీ రేఖ రఘు, పాఠశాల హెచ్‌ఎం సంజీవ్ రెడ్డి, మాజీ సర్పంచ్ అశోక్, నాయకులు లింగారెడ్డి, వెంకటరమణ, ప్రీతంరెడ్డి, తుల శ్రీనివాస్, ఆనంద్, సంజీవ్‌రెడ్డి ఉన్నారు.

సిరికొండ: మండలంలోని పొన్న గ్రామంలో మంగళవారం పర్యటించిన ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

గుడిహత్నూర్: మండలంలోని డొంగర్‌గావ్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు ఇమ్రాన్‌ఖాన్‌కు కడుపు నొప్పికి సంబంధించిన ఆపరేషన్ కావడంతో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆయన ఇంటికి చేరుకొని పరామర్శించారు.

అక్రమాలను అరికట్టేందుకే సామాజిక తనిఖీ

- ఈజీఎస్ ఏపీడీ కుటుంబరావు

తలమడుగు: వేసవికాలంలో గ్రామీణ కూలీలకు ఉపాధి కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అవినీతిని అరికట్టేందుకు సామాజిక ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీవో ఏపీడీ కుటుంబరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ఉపాధి హామీ ప్రజావేదికకు హాజరై మాట్లాడారు. మండలంలో 28 గ్రామ పంచాయతీలలో 2022–23 సంవత్సరంకు రూ.కోటి 40లక్షల పనులు జరిగాయని అన్నారు. గ్రామాల్లో అక్కడక్కడ హరితహారంలో చిన్నచిన్న పొరపాట్లు జరిగాయని పంచాయతీ కార్యదర్శిలు ఫీల్డ్ అసిస్టెంట్లు, తప్పకుండా పథకాన్ని ముందుకు తీసుకువెళ్లాలన్నారు. మొక్కలు చనిపోయిన చోట తిరిగి మళ్లీ నాటాలని, అలాగే ప్రతీ శుక్రవారం గ్రామసభ నిర్వహించి, కూలీలకు ఉపాధి కల్పించాలన్నారు. ఉపాధి హామీ నిధుల అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. వారం రోజులుగా మండలంలోని 28 గ్రామపంచాయతీలో సామాజిక తనిఖీ బృందం ఇంటింటికీ వెళ్లి క్షుణ్ణంగా పనులను పరిశీలించడం జరిగిందన్నారు. సామాజిక తనిఖీలు కొంతమంది సిబ్బంది కూలీలకు తెలియకుండానే సంతకాలు పెట్టి నిధులను దుర్వినియోగం చేశారని వారిపై శాఖపరమైన చర్యలు తప్పవాని అన్నారు. జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, ఎంపీడీవో శేఖర్, ఎంపీపీ కళ్యాణలక్ష్మి రాజేశ్వర్, ఏపీడీ కృష్ణారావు, ఏపీవో మేఘమాల, పశువైద్యులు దూద్‌రామ్ రాథోడ్ పాల్గొన్నారు.



వివరాలు తెలియజేస్తున్న అధికారులు

గ్రామాల్లో నీటి ఎద్దడిని అరికట్టాలి

- సర్వసభ్య సమావేశంలో అధికారులను ఆదేశించిన ఎంపీపీ

సిరికొండ: వేసవిలో మండలంలో నీటి ఎద్దడి లేకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎంపీపీ పెందుర్ అమృత్‌రావు ఆదేశించారు. మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీవో బాలా గంగాధర్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశాన్ని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఇందులో పాల్గొన్న పాలకవర్గ సభ్యులు ప్రధానంగా నీటి సమస్యపైనే చర్చించారు. ఎంపీపీ పెందుర్ అమృత్‌రావు మాట్లాడుతూ గ్రామాల్లో నీటి ఎద్దడి సమస్య ప్రారంభమైందని, అధికారులు తక్షణమే చర్యలు ప్రారంభించాలని ఆదేశించారు. మిషన్ భగీరథ ఏఈ జైపాల్ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యను రాకుండా చూస్తామని, ఇప్పటికే మరమ్మతులు ప్రారంభించామన్నారు. విద్యుత్ లైన్‌మెన్ లింగయ్య మాట్లాడుతూ విద్యుత్ కోతలు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకం ద్వారా జీరో బిల్లు వస్తుందని, జీరో బిల్లు రాని వారు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. వైస్ ఎంపీపీ సాబ్లే సాగర్‌బాయి, తహసీల్దార్ విజయ్‌కుమార్ ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ పెందుర్ అమృత్‌రావు

ఎంపీ టికెట్ బాపూరావుకే కేటాయించాలి

ఇంద్రవెల్లి: ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావుకే మళ్లీ బీజేపీ ఎంపీ టికెట్ కేటాయించాలని కేస్లాపూర్, వడగామ్, నర్సపూర్, వడగామ్ రాయిసెంటర్ల సారమెడిలు మెస్రం వెంకట్‌రావ్, మెస్రం చిన్నుపటేల్, కొట్నాక్ దేవ్‌షావ్, తుంరం జుగాదిరావ్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో నాలుగు రాయిసెంటర్ సార్‌మెడిలు ఆయా గ్రామాల ప్రజలతో సమావేశమై చర్చించారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రధాన మంత్రి మోడీ పర్యటన ఎంపీ సోయం బాపూరావు చొరవతో ఆదివాసీలు అధిక సంఖ్యలో తరలిరావడంతో సభ విజయవంతమైందన్నారు. అదే విధంగా గత 2019 ఎన్నికల్లో సోయం బాపురావ్‌కు టికెట్ కేటాయించడంతో బారీ మెజార్టీతో విజయం సాధించినట్లు తెలిపారు. ఈసారి సైతం ఎంపీ టికెట్‌ను ఆయనకే కేటాయిస్తే ఉమ్మడి జిల్లా రాయిసెంటర్ల సార్‌మెడిలు, పటేల్ వ్యవస్థ ఏకమై భారీ మెజార్టీతో ఎంపీగా గెలిపిస్తామన్నారు. బీజేపీ అధిష్ఠానం చొరవ తీసుకుని మరోసారి టికెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాయిసెంటర్ సలహాదురు వెట్టి రాజేశ్వర్, ఆయా గ్రామాల పెద్దలు మెస్రం బాదిరావ్ పటేల్, మెస్రం కోసేరావ్, దాదారావ్, నాగోరావ్, మనోజ్ ఉన్నారు.



సమావేశంలో రాయిసెంటర్ సార్‌మెడిలు

విద్యార్థులు సెల్‌ఫోన్ వాడకాన్ని తగ్గించాలి

కైలాస్‌నగర్: విద్యార్థులు సెల్‌ఫోన్ వాడకాన్ని తగ్గించి చదువు, ఆటలపై దృష్టి సారించాలని ఎస్పీ గౌస్ ఆలం సూచించారు. సెల్‌ఫోన్ అధిక వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించేలా ఓ ప్రైవేట్ పాఠశాల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 2కే రన్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. స్థానిక ఎన్టీఆర్ చౌక్ నుంచి మొదలైన ఈ రన్ ఇందిరా ప్రియదర్శిని స్టేడియం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటలపై ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. సెల్‌ఫోన్ వాడకాన్ని తగ్గిస్తామంటూ ప్రత్యేక ప్రతిజ్ఞ చేయించారు. రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ మురళీ, సాయిని రవికుమార్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయంగా

జైనథ్: రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోందని డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్‌లో సోయా కొనుగోళ్లను పునః ప్రారంభించి మాట్లాడారు. గత నెల మార్కెట్‌లో ప్రారంభమైన సోయా కొనుగోళ్లు కొన్ని సాంకేతిక కారణాలతో నిలిచిపోయాయని తెలిపారు. దీనికి బీఆర్‌ఎస్ నాయకులు ధర్నా చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఏఎంసీ మార్కెట్ చైర్మన్ పదవులు అమ్ముకున్న జోగు రామన్నకు రైతుల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. ఒక్క రోజులోనే కేంద్రం నుంచి పంట కొనుగోళ్లకు అనుమతులు తెచ్చినా స్థానిక బీజేపీ ఎమ్మెల్యే శంకర్‌ను అభినందించారు. ఎంపీటీసీ కొడిచర్ల సుదర్శన్, నాయకులు అల్లూరి అశోక్ రెడ్డి, జగదీశ్‌రెడ్డి, పిడుగు స్వామి ఉన్నారు.



మాట్లాడుతున్న బాలురి గోవర్ధన్ రెడ్డి

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

గుడిహత్నూర్: యువత చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ చాటాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ అన్నారు. మండలంలోని మాన్కాపూర్ వద్ద నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీని మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. చదువు, క్రీడలు ఈ రెండు ప్రతి ఒక్కరికీ అవసరమన్నారు. క్రీడల్లో రాణించి ఎంతోమంది ఉన్నత స్థాయికి ఎదిగారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవీందర్ నాయక్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



పోటీలు ప్రారంభిస్తున్న పతంగే బ్రహ్మానంద్

సర్టిఫికెట్ కోర్సును వినియోగించుకోవాలి

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల(సైన్స్)లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇంగ్లిశ్ ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థులకు 'ఎన్ ఎసెన్షియల్ ఇంగ్లిష్ గ్రామర్ ఫర్ కాంపిటేటివ్ ఎగ్జామ్స్' అనే 30రోజుల సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. గ్రూప్–1, గ్రూప్–2, టెట్, ఎస్సై, ఎస్సెస్సీ తదితర పోటీ పరీక్షలకు ఉపయోగపడే ఇంగ్లిశ్ గ్రామర్‌ను 30రోజుల పాటు నేర్పించనున్నట్లు తెలిపారు. ఇందులో వైస్ ప్రిన్సిపల్ జాకీర్ హుస్సేన్, కోర్స్ డైరెక్టర్ దయాకర్, తెలుగు అధ్యాపకులు సంతోశ్‌కుమార్, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ రీజినల్ కోఆర్డినేటర్ టి.ప్రతాప్ సింగ్, అకాడమిక్ కోఆర్డినేటర్ రఘునాథ్, ఆంగ్ల అధ్యాపకులు ఆనందం, భువనేశ్వరి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్

కలెక్టర్‌కు సన్మానం



కలెక్టర్‌ను సన్మానిస్తున్న కంది శ్రీనివాసరెడ్డి

కైలాస్‌నగర్: మెదక్ కలెక్టర్‌గా బదిలీపై వెళ్తున్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తన క్యాంపు కార్యాలయంలో కలిసి శాలువతో సత్కరించారు. కలెక్టర్‌గా తన విధులను సమర్థవంతంగా నిర్వర్తించారని, వివాద రహితుడిగా పేరు తెచ్చుకున్నారని ఆయన సేవలను కొనియాడారు. తన ఉద్యోగ జీవితంలో భవిష్యతులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, నాయకులు వెంకట్ రెడ్డి, గంగారెడ్డి ఉన్నారు.

పాఠశాల కోసం వినతి

ఎదులాపురం: పట్టణంలోని వార్డు నం.16 భగత్‌సింగ్‌నగర్‌కి ప్రభుత్వ పాఠశాల మంజూరు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్, డీఈవోకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కాలనీలో దాదాపు 2వేల జనాభా ఉంటుందని, అందరూ కూలీ చేసుకునే వారని తెలిపారు. ఈ కాలనీలో చదువుకునే విద్యార్థులకు పాఠశాల లేకపోవడం బాధకరమన్నారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.స్వామి, లంకా రాఘవులు, టీపీవీఎస్ నాయకులు పూసం సచిన్, ఆశన్న పాల్గొన్నారు.



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గ్రామాల్లో సమస్యలు లేకుండా చూడాలి

బోథ్: గ్రామాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీలత అన్నారు. మంగళవారం బోథ్ గ్రామ పంచాయతీని సందర్శించారు. ఈ సందర్భంగా శానిటేషన్ పనులను పరిశీలించారు. పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. విశ్వకర్మ యోజన కింద ఎంపికైన లబ్ధిదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అనంతరం పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఎంపీవో మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అంజయ్య ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డీపీవో శ్రీలత

మంత్రికి ఎంపీటీసీ వినతి

తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామ ఎంపీటీసీ కొడాల సంతోశ్ మంగళవారం రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి కప్పర్ల నుంచి పొచ్చెర వరకూ డబుల్ రోడ్డు నిర్మాణం చేయాలని వినతిపత్రం అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.



స్థలం కేటాయించాలి

కైలాస్‌నగర్: అద్దె భవనంలో కొనసాగుతున్న వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయ భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు కోరారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను తన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువతో సత్కరించి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లుగా డివిజన్ అధ్యక్షులు టి.హరికిషన్, కార్యదర్శి బి.సాయి కృష్ణ తెలిపారు. సంఘ బాధ్యులు అఖిల్, ఫహీం, అజారుద్దీన్, నీత ఉన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం

తలమడుగు: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మహిళా స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. జెండర్ స్పెషలిస్ట్ కృష్ణవేణి మాట్లాడుతూ భారతదేశంలో మహిళా హక్కులు, లింగ సమానత్వం, మహిళల హక్కులపైన అవగాహన కల్పించారు. సీడీపీవో నర్మమ్మ, మహిళా అధ్యక్షురాలు సునీతరెడ్డి, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, సఖి కౌన్సెలర్ లావణ్య ఉన్నారు.



మాట్లాడుతున్న సఖి కేంద్రం నిర్వాహకులు

ఎదులాపురం: పట్టణంలోని సుందరయ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. అంగన్‌వాడీ టీచర్ రాధ, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.